


ఎయిడ్స్‌ను తరిమేద్దాం
డిగ్రీ చదువుతున్న విద్యార్థులకు ఎయిడ్స్ నివారణపై అవగాహన కల్పించాలని ఎంజీ యూనివర్సిటీ సిద్ధమైంది.
- 8లో



ముగిసిన శివరాత్రి ఉత్సవాలు
యాదగిరిగుట్టలోని శ్రీపర్వతవర్ధిని సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో శివరాత్రి ఉత్సవాలు ముగిశాయి.
- 8లో



ఎద్దుల పందేలు
మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా మేళ్ల చెరువులో శుక్రవారం ఎద్దుల పందేలు ఉత్కంఠభరితంగా సాగాయి.
- 8లో

న్యూస్‌రీల్

8న జాతీయ లోక్ అదాలత్



మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జి ప్రధాన న్యాయమూర్తి శ్యామ్‌శ్రీ

చివ్వెంల: సూర్యాపేట జిల్లా కోర్టులో ఈనెల 8న నిర్వహించే జాతీయ మెగా లోక్ అదాలత్ కార్యక్రమాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఇన్‌చార్జి ప్రధాన న్యాయమూర్తి ఎం.శ్యామ్‌శ్రీ అన్నారు. శుక్రవారం సూర్యాపేట జిల్లా కోర్టు ప్రాంగణంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాజీ మార్గమే రాజమార్గమన్నారు. చిన్న చిన్న ఘర్షణలతో కోర్టుల వరకు వెళ్లకుండా లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చన్నారు. లోక్ అదాలత్‌పై పారాలీగల్ వలంటీర్లు గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఆమె వెంట జిల్లా న్యాయసేవాధికార సంస్థకార్యదర్శి శ్రీవాణి తదితరులు ఉన్నారు.

రైతు సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న కంబాల శ్రీనివాస్

హుజూర్‌నగర్: తెలంగాణ ప్రభుత్వం రైతుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించకుండా వారి సమస్యలు పరిష్కరించాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కంబాల శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం హుజూర్‌నగర్‌లోని సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన ఆ సంఘం ముఖ్యనాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మిర్చి పంటకు మద్దతు ధర అందించాలన్నారు. రైతుల రుణమాఫీ, సన్నరకం వడ్లకు బోనస్, రైతు భరోసా పూర్తిస్థాయిలో అమలు కాకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రైతులకు ఇచ్చిన హామీలను పక్కాగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఐ పట్టణ కార్యదర్శి గుండు వెంకటేశ్వర్లు, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు జడ శ్రీనివాస్, నాయకులు యల్లావుల రమేష్, జడ వెంకన్న, జక్కుల రమేష్, సుందరి పద్మ, జక్కుల శ్రీనివాస్, యల్లావుల ఉమ, చెన్నబోయిన సైదులు, చక్రాల స్టాలిన్, యల్లావుల సురేందర్, కుడితొట్టి స్వామి తదితరులు పాల్గొన్నారు.

వైద్యసేవల్లో లోపాలు ఉండొద్దు



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ కోటాచలం

హుజూర్‌నగర్: ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సేవలు పక్కాగా అందించాలని, లోపాలుంటే కఠిన చర్యలు తప్పవని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కోటాచలం హెచ్చరించారు. శుక్రవారం హుజూర్‌నగర్‌లోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఆపరేషన్లు తగ్గించి సాధారణ ప్రసవాలను పెంచాలని చెప్పారు. ఈ సమావేశంలో హుజూర్‌నగర్, కోదాడ ప్రభుత్వ ఆసుపత్రుల వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

యాదవులకు ఎమ్మెల్సీ స్థానం కేటాయించాలి

సూర్యాపేట టౌన్: రాష్ట్రంలో ఎమ్మెల్యే కోటాలో ఖాళీ అయిన ఐదు ఎమ్మెల్సీ స్థానాల్లో ఒక స్థానాన్ని యాదవ సామాజిక వర్గానికి కేటాయించాలని అఖిల భారత యాదవ మహాసభ జిల్లా అధ్యక్షుడు మర్యాద సైదులు యాదవ్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ప్రతి నియోజకవర్గానికి 30 వేల నుంచి 40 వేల ఓట్లు కలిగిన అతిపెద్ద సామాజిక వర్గం యాదవులు అన్నారు. జిల్లా నుంచి యాదవ సామాజిక వర్గానికి చెందిన కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చెవిటి వెంకన్న యాదవ్‌కు ఎమ్మెల్సీ సీటు కేటాయించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి తూము వెంకన్న యాదవ్, గొడ్డేటి సైదులు యాదవ్, కోడి లింగయ్య యాదవ్, రమేష్ యాదవ్, కంచుగట్ల జానయ్య, నాగరాజు, భిక్షపతి యాదవ్, శ్రీనివాస్ యాదవ్, కాసం రాము యాదవ్, మల్లేష్, వెంకటేష్, సైదులు, వేల్పుల లింగయ్య యాదవ్, కంచుగట్ల యాదగిరి యాదవ్, రాజు యాదవ్, కుర్ర సైదులు యాదవ్, నర్సయ్య, రమణ పాల్గొన్నారు.

ఇంటింటా సౌరకాంతులు



హుజూర్‌నగర్‌లో ఓ ఇంటిపై సౌర విద్యుత్ ప్యానెల్‌ను పరిశీలిస్తున్న అధికారులు

పీఎం సూర్యఘర్ పథకం కింద సబ్సిడీపై సోలార్ యూనిట్లు

- 1 నుంచి 6 కిలోవాట్ల సామర్థ్యం వరకు ప్యానళ్లు
- అర్జీదారుల్లో ఇప్పటికే 96శాతం మంది ఇళ్లపై ఏర్పాటు
- పరిశీలించి వినియోగానికి గ్రీన్‌సిగ్నల్ ఇస్తున్న విద్యుత్ శాఖ

హుజూర్‌నగర్: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకంతో ఇంటింటా సౌర విద్యుత్‌కాంతులు వెదజల్లుతున్నాయి. ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా దరఖాస్తు చేసుకున్న ఇళ్ల యజమానుల్లో 96.27 శాతం మంది తమ ఇళ్లపై సౌర విద్యుత్ ప్యానళ్లను ఏర్పాటు చేసుకున్నారు. వీటిని విద్యుత్ అధికారులు పరిశీలించి వినియోగానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. మిగతా వారు ఏర్పాటు పనుల్లో నిమగ్నమయ్యారని అధికారులు పేర్కొంటున్నారు.

ప్రభుత్వ సబ్సిడీ ఇలా

ఒక్కో కుటుంబం 1 నుంచి 3 కిలోవాట్ల సామర్థ్యం గల సౌరవిద్యుత్ ప్యానళ్లు ఏర్పాటు చేసుకోవచ్చు. కిలోవాట్ సామర్థ్యం గల సౌరవిద్యుత్ ప్యానళ్లు ఏర్పాటు చేసుకోవడానికి రూ.80 వేలు ఖర్చు వస్తుండగా కేంద్ర ప్రభుత్వం నుంచి సబ్సిడీ రూ.30 వేలు లభిస్తుంది. 2 కిలోవాట్ల సామర్థ్యం గల సౌర విద్యుత్ ప్యానళ్లు ఏర్పాటు చేసుకోవడానికి రూ.1.60 లక్షల ఖర్చు వస్తుండగా కేంద్ర ప్రభుత్వం నుంచి సబ్సిడీ రూ.60 వేలు లభిస్తుంది. 3 కిలోవాట్ల సామర్థ్యం గల సౌరవిద్యుత్ ప్యానళ్లు ఏర్పాటు చేసుకోవడానికి రూ.2.10 లక్షల ఖర్చు వస్తుండగా కేంద్రం నుంచి సబ్సిడీ రూ.78 వేలు లభిస్తుంది. 3కిలోవాట్ల సామర్థ్యం ప్యానల్ ద్వారా నెలకు 400 నుంచి 500 యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుంది. 5 కిలోవాట్ల ప్యానల్ ఏర్పాటు చేసుకుంటే రూ.3.20 లక్షలు ఖర్చు అవుతుంది. రూ.78 వేలు రాయితీ లభిస్తుంది. నెలకు 600యూనిట్ల వరకు విద్యుత్ ఉత్పత్తి అవుతుంది. వినియోగదారులువాడుకోగా మిగిలిన ఆ కరెంట్‌ను విద్యుత్ శాఖ కొనుగోలు చేసి యూనిట్‌కు రూ.3.25ల చొప్పున ఆరు నెలలకు ఒకసారి నగదు చెల్లిస్తుంది.

అర్జీలు ఇలా..	
దరఖాస్తు చేసుకున్న వారు	537
ప్యానళ్లు ఏర్పాటు చేసుకుంది	517
పురోగతిలో ఉన్న ప్యానళ్లు	20

ఇలా.. దరఖాస్తు చేసుకోండి..

సౌర విద్యుత్ ప్యానళ్ల ఏర్పాటు చేసుకునే వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. వ్యక్తిగత వివరాలు, సెల్ నంబర్స్ తర్వాత ఓటీపీ, ఆ తర్వాత ఇంటి విద్యుత్ సర్వీస్ కనెక్షన్ వివరాలు నమోదు చేయాలి. దరఖాస్తులను విద్యుత్ శాఖ అధికారులు పరిశీలిస్తారు. ఆ శాఖ సిబ్బంది దరఖాస్తుదారుల ఇంటికి వెళ్లి పరిశీలించి సౌర విద్యుత్ ప్యానెళ్ల ఏర్పాటుకు సాంకేతిక అనుమతులు జారీ చేస్తారు. నచ్చిన కంపెనీని ఎంపిక చేసుకుంటే వారి సిబ్బంది వచ్చి ప్యానల్ ఏర్పాటు చేస్తారు. ఆ తర్వాత లబ్ధిదారుల ఖాతాలో రాయితీ సొమ్ము జమ అవుతుంది.

పర్యావరణానికి మేలు కలుగుతుంది



సోలార్ విద్యుత్ ప్యానల్ ఏర్పాటు చేసుకోవడం వల్ల సూర్యరశ్మితో విద్యుత్ ఉత్పత్తి చేసుకోవచ్చు. సోలార్ విద్యుత్ వినియోగం వల్ల కరెంట్ బిల్లుల ఖర్చు తప్పుతుంది. వినియోగదారులు వినియోగించుకోగా మిగిలిన విద్యుత్‌ను విక్రయించుకోవచ్చు. సోలార్ విద్యుత్ వినియోగం వల్ల పర్యావరణానికి ఎంతో మేలు కలుగుతుంది. ఎంతో విలువైన భూగర్భ ఖనిజాలను మనం పరిరక్షించుకోచ్చు.

– వెంకటకిష్టయ్య, విద్యుత్ డీఈ, హుజూర్‌నగర్

జాతీయ బ్యాకుల నుంచి రుణసదుపాయం

సౌర విద్యుత్ ప్యానల్స్ కావాలనుకునే వినియోగదారులకు ఆర్థిక పరిస్థితి అనుకూలించకపోతే అటువంటి వారికి జాతీయ బ్యాంకుల నుంచి రుణం ఇస్తారు. ఆర్థిక సహాయం కావాలనుకునే వారు సదరు ప్యానల్ ఏర్పా చేసే కంపెనీ వారు జాతీయ బ్యాంకుల అధికారులతో మాట్లాడి ఆయా బ్యాంకుల నుంచి రుణం ఇప్పిస్తారు. తర్వాత వినియోగదారుడు తీసుకున్న సదరు రుణాన్ని బ్యాంకుకు వాయిదాల రూపంలో సక్రమంగా చెల్లించాల్సి ఉంటుంది.

వైభవంగా రథోత్సవం



మేళ్లచెరువు జాతరలో నిర్వహించిన రథోత్సవంలో పాల్గొన్న భక్తజనం

మేళ్లచెరువు: మేళ్లచెరువు మండలకేంద్రంలోని ఇష్టకామేశ్వరి సమేత శ్రీస్వయంభు శంభులింగేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు కనుల పండువగా కొనసాగుతున్నాయి. మూడో రోజైన శుక్రవారం వివిధ రకాల పూలతో అలంకరించిన రథంపై ఉత్సవమూర్తులను వైభవంగా ఊరేగించారు. ముందుగా వేదమూర్తులు గణపతి పూజ, హోమం, రథాంగపూజ, అష్టదిక్పాలకులకు శాంతి నిర్వహించి ఓం నమఃశివాలయ అంటూ భక్తులు స్వామివారిని స్మరిస్తూ మంగళవాయిద్యాలు, నృత్య ప్రదర్శనల నడుమ పురవీధుల్లో రథాన్ని లాగి భక్తిభావం చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ కె.భాస్కర్, ఆలయ కార్యనిర్వాహణాధికారి కొండారెడ్డి, రెనివేషన్ కమిటీ చైర్మన్ శాగంరెడ్డి శంభిరెడ్డి, కాకునూరి భాస్కరరెడ్డి, శాగంరెడ్డి గోవిందరెడ్డి, కమిటీ సభ్యులు నర్సింహరావు, శ్రీను, శంభయ్య, గోవిందరెడ్డి, చందర్‌రావు, గణేష్, అర్చకులు రాధాకృష్ణమూర్తిశర్మ, విష్ణువర్ధన్‌శర్మ, ధనుంజయశర్మ, భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి



కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్, ఇతర అధికారులు

భానుపురి (సూర్యాపేట): జిల్లాలో ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తెలిపారు. ఈ నెల 5 నుంచి ప్రారంభం కానున్న ఇంటర్ వార్షిక పరీక్షల ఏర్పాట్లపై శుక్రవారం కలెక్టర్లు, పోలీస్ కమిషనర్లు, ఎస్పీలతో సీఎస్ శాంతికుమారి హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. పరీక్షల నిర్వహణపై సంబంధిత శాఖల అధికారులకు కీలక సూచనలు చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి కేంద్రంలోనూ పరీక్షల నిర్వహణ తీరును చీఫ్ సూపరింటెండెంట్లు నిశితంగా పర్యవేక్షించాలని ఆదేశించారు. కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పించాలని, కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలన్నారు. ఏవైనా సమస్యలు, సందేహాలుంటే వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని డీఐఈఓను ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ పి.రాంబాబు, అదనపు ఏఎస్పీ నాగేశ్వరరావు, డీఐఈఓ అశోక్ కుమార్, ఆర్డీఓలు వేణుమాధవ్, శ్రీనివాసులు, సూర్యనారాయణ, మున్సిపల్ కమిషనర్లు శ్రీనివాస్, రమాదేవి, శ్రీనివాస్‌రెడ్డి, రాజేంద్రకుమార్, డీఎంహెచ్‌ఓ డాక్టర్ కోటాచలం తదితరులు పాల్గొన్నారు.

పరీక్షల నిర్వహణలో అవకతవకలు జరగొద్దు

- ఇంటర్ బోర్డు డిప్యూటీ సెక్రటరీ హేమచందర్, డీఐఈఓ భానునాయక్



మాట్లాడుతున్న డీఐఈఓ భానునాయక్

సూర్యాపేట టౌన్: ఈనెల 5వ తేదీ నుంచి జరగనున్న ఇంటర్ వార్షిక పరీక్షలను ఎలాంటి అవకతవకలు, అక్రమాలకు తావు లేకుండా బోర్డు నిబంధనల మేరకు పకడ్బందీగా నిర్వహించాలని ఇంటర్ బోర్డు డిప్యూటీ సెక్రటరీ చకిలం హేమచందర్, డీఐఈఓ భానునాయక్ అన్నారు. శుక్రవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఇంటర్ బోర్డు ప్రాంతీయ కార్యాలయంలో డీఓలు, సీఎస్‌లకు నిర్వహించిన ఓరియంటేషన్ కార్యక్రమంలో వారు మాట్లాడారు. పేపర్ లీకేజీలు, ప్రశ్న పత్రాలు జారీలో ఎలాంటి పొరపాట్లు జరిగినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లాలో 12 ప్రభుత్వ, 20 ప్రైవేట్ కళాశాలల్లో సూర్యాపేటలో 13, కోదాడలో 8, హుజూర్‌నగర్‌లో 2, తుంగతుర్తిలో 2, నెమ్మికల్‌లో 1, మఠంపల్లిలో 1, నడిగూడెంలో 2, తిరుమలగిరిలో 2, నేరేడుచర్లలో 1 చొప్పున మొత్తం 32 కేంద్రాల్లో పరీక్షలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వీటిల్లో జనరల్ ఫస్టియర్ 6,688 మంది, జనరల్ సెకండియర్ 6,666 మంది, ఒకేషనల్ ఫస్టియర్ 1,952, ఒకేషనల్ సెకండియర్ 1,642 మందితో కలిపి మొత్తం 16,948 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని పేర్కొన్నారు. రెండు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, రెండు సిట్టింగ్ స్క్వాడ్ బృందాలు, 32 మంది చీఫ్ సూపరింటెండెంట్స్, 32 మంది డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లతోపాటు 850 మంది ఇన్విజిలేటర్లను నియమించామన్నారు. బోర్డు నిబంధనల మేరకు ఉదయం 9 గంటల తర్వాత నిమిషం ఆలస్యమైనా విద్యార్థులను పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించబడదన్నారు. ఈ కార్యక్రమంలో డీఈసీ సభ్యులు జానపాటి కృష్ణయ్య, గుడిపాటి లక్ష్మయ్య, జిల్లా బల్క్ అధికారి విజయనాయక్, ప్రిన్సిపాల్ పెరుమాళ్ల యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

యాదగిరీశుడికి బ్రహ్మోత్సవ శోభ

నేటి నుంచి వార్షిక బ్రహ్మోత్సవాలు

- విశ్వక్సేన ఆరాధనతో శ్రీకారం
- 7న ఎదుర్కోలు, 8న తిరుకల్యాణం

యాదగిరిగుట్ట : తెలంగాణలో ప్రసిద్ధిగాంచిన యాదగిరిగుట్ట పంచనారసింహుడి దివ్యక్షేత్రం వార్షిక బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. మంగళవారం విశ్వక్సేన ఆరాధన, స్వస్తివాచనంతో మొదలై శృంగార డోలోత్సవంతో బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి. 11 రోజుల పాటు జరిగే బ్రహ్మోత్సవాలను పాంచరాత్ర ఆగమ సిద్ధాంతానుసారంగా, సంప్రదాయరీతిలో వైభవంగా నిర్వహించేందుకు దేవస్థానం అధికారులు భారీ ఏర్పాట్లు చేశారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలు, తోరణాలు, పూలతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు.

11 రోజులు జరిగే కార్యక్రమాలు

- 1వ తేదీన ఉదయం 10గంటలకు విశ్వక్సేన ఆరాధన, స్వస్తివాచనం, రక్షాబంధనంతో బ్రహ్మోత్సవాలకు అర్చకులు శ్రీకారం చుట్టనున్నారు. సాయంత్రం 6.30 గంటలకు మృత్సంగ్రహణం, అంకురారోపణ ఉంటుంది.
- 2న ఉదయం 8గంటలకు అగ్నిప్రతిష్ఠ, 11గంటలకు ధ్వజారోహణం, సాయంత్రం 6.30 గంటలకు భేరీపూజ, దేవతాహ్వానం, హవన పూజ.
- 3న ఉదయం 9 గంటలకు మత్స్యావతార అలంకార సేవ, రాత్రి 7గంటలకు శేష వాహన సేవ.
- 4న ఉదయం 9గంటలకు వటపత్రశాయి అలంకారం, రాత్రి 7గంటలకు హంసవాహన సేవ.
- 5న ఉదయం 9గంటలకు మురళీకృష్ణుడి అలంకారం, రాత్రి 7గంటలకు పొన్న వాహన సేవ.
- 6న ఉదయం 9గంటలకు గోవర్ధనగిరిధారి అలంకార సేవ, రాత్రి సింహవాహన సేవ.
- 7న ఉదయం 9గంటలకు జగన్మోహిని అలంకారం, రాత్రి అశ్వవాహన సేవ, ఆ తరువాత శ్రీస్వామి, అమ్మవార్ల ఎదుర్కోలు ఉత్సవం.
- 8న ఉదయం శ్రీరామ అలంకారంలో హనుమంత వాహనంపై ఊరేగింపు నిర్వహిస్తారు. రాత్రి గజవాహన సేవ, 8.45 గంటలకు శ్రీస్వామి,అమ్మవార్ల తిరుకల్యాణ మహోత్సవం.
- 9న ఉదయం 9గంటలకు శ్రీమహావిష్ణు అలంకార సేవలో గరుఢ వాహనం సేవపై శ్రీస్వామివారి ఊరేగింపు, రాత్రి 8గంటలకు ఆలయ తిరు, మాఢ వీధుల్లో దివ్యవిమాన రథోత్సవం.
- 10న ఉదయం 10.30గంటలకు చక్రతీర్థస్నానం వేడు, రాత్రి శ్రీపుష్పయాగం, దోపోత్సవం.
- 11న ఉదయం 10గంటలకు అష్టోత్తర శతఘటాభిషేకం, రాత్రి 9గంటలకు శ్రీస్వామి వారి శృంగార డోలోత్సవం, దోపు ఉత్సవంతో బ్రహ్మోత్సవాలు పరిసమాప్తం కానున్నాయి.

ప్రథమ ప్రాకార మండపంలో..


ప్రథమ ప్రాకార మండపంలో స్వామి వారిని అలంకరించి సేవలను తిరుమాడ వీధుల్లో ఊరేగిస్తారు. అలంకారసేవలను భక్తులకు దర్శించుకునేందుకు వీలుగా ఏర్పాట్లు చేస్తున్నారు.

రూ.3.15 కోట్లు కేటాయించాం

బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు భారీ ఏర్పాట్లు చేశాం. ఇందుకోసం రూ.3.15 కోట్ల బడ్జెట్ కేటాయించాం. రోజూ 2,500 మంది భక్తులకు అన్న ప్రసాదం అందించేందుకు ఏర్పాట్లు చేశాం. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా తాగునీరు, బస్సులు, టాయిలెట్లు ఇతర సౌకర్యాలు కల్పిస్తున్నాం. రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, సీఎం రేవంత్‌రెడ్డితో పాటు పలువురు మంత్రులకు ఆహ్వానపత్రికలు అందజేశాం. –భాస్కర్‌రావు, యాదగిరిగుట్ట దేవస్థానం ఈఓ

ఉత్తర మాడవీధిలో కల్యాణం

శ్రీస్వామి, అమ్మవారి తిరుకల్యాణ మహోత్సవానికి రాష్ట్రంతో పాటు దేశ నలుమూలల నుంచి భక్తులు భారీగా తరలిరానున్నారు. ఇందుకోసం దేవస్థానం అధికారులు విస్తృతంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రధానాలయ ఉత్తర మాడవీధిలో కల్యాణవేడుక నిర్వహించనున్నారు. కల్యాణోత్సవంలో పాల్గొనేందుకు భక్తులు రూ.3,000 టికెట్ తీసుకోవాలని అధికారులు కోరుతున్నారు.



విద్యుత్ దీపాల అలంకరణలో యాదగిరీశుడి ప్రధానాలయ ముఖ మండపం

సాగునీరు అందించాలని నూతనకల్ రైతుల ధర్నా



సూర్యాపేటలో ఇరిగేషన్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న నూతనకల్ మండల రైతులు

భానుపురి (సూర్యాపేట): ఎస్సారెస్పీ రెండో దశ ద్వారా సాగునీరు అందించి పంటలను కాపాడాలని డిమాండ్ చేస్తూ నూతనకల్ మండలానికి చెందిన రైతులు సూర్యాపేట ఇరిగేషన్ కార్యాలయం ఎదుట శుక్రవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు రెండు పంటలకు సాగునీరు అందిస్తామని మాయమాటలు చెప్పారని, ప్రస్తుతం పంటలు ఎండిపోతున్నా పట్టించుకోవడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో మండలానికి చెందిన రైతులు తీగల మల్లారెడ్డి, పన్నాల మల్లారెడ్డి, జక్కుల మల్లయ్య, అనిల్‌రెడ్డి, మల్లారెడ్డి, మధుసూదన్, రవీందర్‌రెడ్డి, రవి, సురేందర్, ఆకుల సత్తయ్య, ఉపేందర్‌రెడ్డి, బయ్య ముత్యాలి తదితరులు పాల్గొన్నారు.

ఎవరి లెక్కలు వారివే!

- అంచనాలు వేసుకుంటున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థులు
- తామంటే.. తామే గెలుస్తామని ధీమా
- ఒక్కో జిల్లాలో ఒక్కో అభ్యర్థికి ఓట్లు పడ్డాయని చెబుతున్న సంఘాలు
- ఐదుగురి మధ్యే గట్టి పోటీ ఉంటుందని చెబుతున్న నేతలు



స్ట్రాంగ్ రూమ్‌కు సీల్ వేయిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్‌చంద్రపవార్

సాక్షి ప్రతినిధి, నల్లగొండ : వరంగల్ ఖమ్మం – నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ముగియడంతో ఎవరికి ఎన్ని ఓట్లు పడ్డాయన్న అంచనాల్లో అభ్యర్థులు తనమునకలయ్యారు. జిల్లాలు, మండలాల వారీగా తమ సంఘాల సభ్యులు, తమ మద్దతుదారులు ఓట్లు వేసిన తీరును బట్టి గెలుపు తమదంటే.. తమదేనంటూ ధీమాలో ఉన్నారు.

బరిలో 19 మంది..

ఈ ఎన్నికల్లో 19 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నా ఐదుగురి మధ్యే ప్రధాన పోటీ ఉంటుందని ఉపాధ్యాయ, అధ్యాపక సంఘాలు అంచనా వేస్తున్నాయి. పీఆర్‌టీయూ బలపరిచిన అభ్యర్థి పింగిళి శ్రీపాల్‌రెడ్డి, యూటీఎఫ్ బలపరిచిన, ప్రస్తుత ఎమ్మెల్సీ నర్సిరెడ్డి, టీచర్స్ జేఏసీ, కాంగ్రెస్ మద్దతుతో పోటీలో ఉన్న హర్షవర్ధన్‌రెడ్డి, బీసీ వాదంతో బరిలో ఉన్న పూల రవీందర్, టీపీయూఎస్ బలపరిచిన, బీజేపీ అభ్యర్థి పులి సరోత్తంరెడ్డి మధ్యే ప్రధాన పోటీ ఉంటుందని అంచనా వేసుతన్నారు.

జిల్లాల వారీగా మారుతున్న బలాలు!

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గంలో ఒక్కో జిల్లాలో ఒక్కో అభ్యర్థి తమకు అనుకూలంగా ఉంటుందని అంచనాలు వేసుకుంటున్నారు. వరంగల్ జిల్లాలో తమకు మొదటి ప్రాధాన్య ఓట్లు అధికంగా వస్తాయని పీఆర్‌టీయూ, బీజేపీ, టీచర్స్ జేఏసీ అభ్యర్థులతోపాటు వారి అనుచరులు చెబుతుండగా, ఖమ్మం జిల్లాలో తమ అభ్యర్థికి అత్యధిక ఓట్లు వస్తాయని యూటీఎఫ్ నేతలు లెక్కలు వేసుకుంటున్నారు. గురుకులాలు, కేజీబీవీలు, ఆశ్రమ పాఠశాలలు, వ్యాయామ, భాషా పండితులు, ఆదర్శ పాఠశాలలు, ఇంటర్, డిగ్రీ కాలేజీల ఉపాధ్యాయ ఓట్లలో తమకే గణనీయంగా వచ్చాయని టీచర్స్ జేఏసీ బలపరిచిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి అనుచరులు చెబుతున్నారు. వరంగల్‌తోపాటు భద్రాద్రి కొత్తగూడెం, నల్లగొండలో తనకు ఎక్కువ ఓట్లు వస్తాయని టీచర్స్ జేఏసీ అభ్యర్థి అంచనా వేసుకుంటున్నారు. అయితే బహుజన, బీసీ వాదంతో పాటు అంసతృప్తి ఓట్లు తమకే వచ్చాయని, మొదటి ప్రాధాన్య ఓట్లతోనే గెలువబోతున్నామని మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్ అనుచరులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం ఉన్న సంఘాలపై వ్యతిరేక ఓట్లతోపాటు జాతీయవాద భావజాలమున్న ఉపాధ్యాయులంతా తమకే ఓటేశారని, గెలుపు తమదేనని బీజేపీ అభ్యర్థి సరోత్తంరెడ్డి అనుచరులు పేర్కొంటున్నారు.

గెలుపోటములు నిర్ణయించేది ద్వితీయ ప్రాధాన్య ఓట్లే?

హోరాహోరీగా సాగిన ఈ ఎన్నికలో మొదటి ప్రాధాన్య ఓట్లతో కోటా ఓటు సాధ్యం కాదని, ద్వితీయ ప్రాధాన్య ఓట్లే గెలుపును నిర్ణయిస్తాయని ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు. దాదాపుగా మొదటి ప్రాధాన్య ఓట్లు ఆయా సంఘాలు బలపరిచిన అభ్యర్థులకే పడతాయని చెబుతున్నారు. మొదటి ప్రాధాన్య ఓట్లతో గెలుస్తామని, పీఆర్‌టీయూ, యూటీఎఫ్, ఎస్టీయూ నేతలు చెబుతున్నారు. మిగితా అభ్యర్థులను బలపరిచిన టీచర్స్ జేఏసీ, టీపీయూఎస్, బీజేపీ మాత్రం రెండో ప్రాధాన్య ఓట్లతోనే తుది ఫలితాలు వస్తాయని పేర్కొంటున్నాయి. మొదటి ప్రాధాన్యత ఓట్లను ప్రధాన అభ్యర్థులు కొద్దిపాటి తేడాలతో పంచుకునే అవకాశమే ఉంటుందని, రెండో ప్రాధాన్య ఓట్లే గెలుపోటములను నిర్ణయిస్తాయన్న చర్చ సాగుతోంది.

స్ట్రాంగ్ రూమ్‌కు సీల్

నల్లగొండ : ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ గురువారం ముగిసింది. అనంతరం 12 జిల్లాల నుంచి వచ్చిన బ్యాలెట్ బాక్సులను ఆర్జాలబావి సమీపంలోని గోదాం వద్ద ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లో శుక్రవారం భద్రపరిచారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్ చంద్ర పవార్ దగ్గరుండి.. పోటీలో ఉన్న అభ్యర్థులు, ఏజెంట్ల సమక్షంలో స్ట్రాంగ్ రూమ్‌కు సీల్ వేయించారు.

క్లుప్తంగా

ఐదుగురు జూదరుల అరెస్టు

పెన్‌పహాడ్‌: మండల పరిధిలోని అనంతారం గ్రామ శివారులో ఆవుల చెరువు వద్ద పేకాట ఆడుతున్న ఐదుగురిని శుక్రవారం పోలీసులు అరెస్ట్‌ చేశారు. సమాచారం మేరకు ఎస్‌ఐ గోపికృష్ణ పోలీస్‌ సిబ్బందితో శుక్రవారం సాయంత్రం దాడులు నిర్వహించారు. అనంతారం గ్రామానికి చెందిన నలుగురు, సింగారెడ్డిపాలెం గ్రామానికి చెందిన ఒకరిని అరెస్టు చేసి వారి నుంచి రూ. 5వేలు, ఐదు బైక్‌లు, ఐదు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకొని సీజ్‌ చేశారు. నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

వృద్ధురాలి మెడలో పుస్తెల తాడు అపహరణ



సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

చివ్వెంల(సూర్యాపేట): వృద్ధురాలి మెడలోని పుస్తెల తాడును గుర్తు తెలియని వ్యక్తి అపహరించాడు. ఈ సంఘటన చివ్వెంల మండల పరిధిలోని తిమ్మాపురం గ్రామంలో గురువారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన నారెడ్డి ధనమ్మ, భర్త జానకిరాంరెడ్డి ఇంట్లో కూర్చొని ఉన్నారు. గుర్తు తెలియని వ్యక్తి బైక్‌పై వచ్చి ఇంట్లోకి చొరబడి వృద్ధురాలి మెడలో ఉన్న 48 గ్రాముల బంగారు పుస్తెల తాడు అపహరించుకుని వెళ్లాడు. బాధితురాలి కుమారుడు మధుసూదన్‌ రెడ్డి ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ మహేశ్వర్‌ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సంఘటన స్థలాన్ని సూర్యాపేట రూరల్‌ సీఐ రాజశేఖర్‌ పరిశీలించారు.

బెల్ట్‌షాపు నిర్వహణకు వేలంపాట!

రాజాపేట: రాజాపేట మండలంలోని పాముకుంట గ్రామంలో ఒక్కటే బెల్టుషాపు నిర్వహించాలని శుక్రవారం వేలం పాట నిర్వహించారు. ఈమేరకు గ్రామానికి చెందిన ఓ వ్యక్తి రూ. 2లక్షల 50వేలకు దక్కించుకున్నాడు. వేలంపాటలో దక్కించుకున్న వ్యక్తి రెండు సంవత్సరాలపాటు బెల్టుషాపు నిర్వహించడానికి గ్రామస్తులతో ఒప్పందం చేసుకున్నట్లు తెలిసింది. ఈ విషయమై రాజాపేట ఎస్‌ఐ అనిల్‌కుమార్‌ను సంప్రదించగా.. వేలంపాటపై ఎలాంటి సమాచారం లేదని, గ్రామాల్లో బెల్టుషాపులు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

రోడ్డుప్రమాదంలో వ్యక్తికి గాయాలు

తిప్పర్తి: వాటర్‌ ట్యాంకర్‌ను లారీ ఢీకొన్న ఘటనలో లారీ డ్రైవర్‌కు గాయాలైన సంఘటన తిప్పర్తి మండలంలోని దుప్పలపల్లి సమీపంలో చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. దుప్పలపల్లి గ్రామం వద్ద రోడ్డు మధ్యలో ఉన్న చెట్లకు ట్యాంకర్‌ నీరు పోస్తుండగా.. నల్లగొండ నుంచి మిర్యాలగూడం వైపు వెళ్తున్న లారీ వాటర్‌ ట్యాంకర్‌ను వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో లారీ డ్రైవర్‌కు గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం 108వాహనంలో నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ఎయిడ్స్‌ భూతాన్ని తరిమేద్దాం

- డిగ్రీ విద్యార్థులకు అవగాహన సదస్సులు నిర్వహించాలని నిర్ణయం
- కార్యాచరణ రూపొందించిన ఎయిడ్స్‌ కంట్రోల్‌ సొసైటీ, ఎంజీ యూనివర్సిటీ అధికారులు

నల్లగొండ టూటౌన్‌: ఉమ్మడి జిల్లాలోని డిగ్రీ చదువుతున్న విద్యార్థులకు ఎయిడ్స్‌ నివారణపై అవగాహన కల్పించాలని ఎంజీ యూనివర్సిటీ జాతీయ సేవా పథకం నిర్ణయించింది. తెలంగాణ స్టేట్‌ ఎయిడ్స్‌ కంట్రోల్‌ సొసైటీ సహకారంతో నల్లగొండ, యాదాద్రి భువనగిరి, సూర్యాపేట జిల్లా కేంద్రాల్లో ఈ నెల మొదటి వారం నుంచి అవగాహన సదస్సులు నిర్వహించేందుకు ప్రణాళికలు రూపొందించారు. ఈ సదస్సులకు విద్యార్థులందరూ హాజరయ్యేలా చర్యలు చేపట్టారు. ఎయిడ్స్‌ భూతం పారద్రోలాలంటే ప్రతి ఒక్కరిలో చైతన్యం రావాల్సిన అవసరం ఉందని ఎయిడ్స్‌ కంట్రోల్‌ సొసైటీ బాధ్యులు, ఎంజీ యూనివర్సిటీ అధికారులు పేర్కొంటున్నారు. ఎయిడ్స్‌ వచ్చిందని దాచుకుంటే ప్రాణాంతకంగా మారే విషయాన్ని విద్యార్థులకు అవగాహన కల్పించడంతో గ్రామీణ ప్రాంతాల్లో ఇది విస్తృతంగా ప్రచారం పొందే అవకాశం ఉందని అభిప్రాయపడుతున్నారు.



ఉమ్మడి జిల్లాలో 56 డిగ్రీ కళాశాలలు

ఉమ్మడి జిల్లాలో మొత్తం 56 డిగ్రీ కాలేజీలు ఉన్నాయి. వీటిలో డిగ్రీ చదువుతున్న విద్యార్థులు వేల సంఖ్యలో ఉన్నారు. ఒక్కో ప్రభుత్వ కళాశాలలో 3 వేలకు పైగానే విద్యార్థులు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. కాలేజీ స్థాయిలోనే హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌ పై విద్యార్థులకు అవగాహన కల్పించడం ద్వారా ఎయిడ్స్‌ మహమ్మారిని సమాజం నుంచి పారద్రోలాలనే లక్ష్యంతో ఎయిడ్స్‌ కంట్రోల్‌ సొసైటీ, ఎంజీ యూనివర్సిటీ సంయుక్తంగా కార్యాచరణ రూపొందించింది. ఇప్పటికే ఈ సదస్సుల నిర్వహణ ఖర్చు కూడా ఎయిడ్స్‌ కంట్రోల్‌ సొసైటీ భరించనుంది. యుక్త వయస్సులో ఆకర్షణకు గురై అపరిచిత వ్యక్తులతో శృంగారంలో పాల్గొనడం ద్వారా ఎయిడ్స్‌ ప్రమాదం బారిన పడే అవకాశం ఉందనే విషయాన్ని విద్యార్థులకు తెలియజేయనున్నారు.

అవగాహన కోసమే సదస్సులు

నైతిక విలువలతో ఎయిడ్స్‌ను నివారించవచ్చు. కళాశాల స్థాయిలో విద్యార్థులకు అవగాహన కల్పించడం ద్వారా వారిలో చైతన్యం వస్తుంది. ఒక్కో విద్యార్థి మరో పది మందిని చైతన్యం చేసే అవకాశం ఉంటుంది. ఎయిడ్స్‌ను పారద్రోలడానికి ఈ సదస్సులు ఎంతో దోహద పడతాయి.

– మద్దిలేటి, ఎన్‌ఎస్‌ఎస్‌ కోఆర్డినేటర్‌

చెరువులో పడి ఇద్దరు చిన్నారులు మృతి

చందంపేట: ఇద్దరు చిన్నారులు ఆడుకుంటూ సమీపంలోని చెరువులో స్నానం చేసేందుకు దిగి మృత్యువాతపడిన సంఘటన చందంపేట మండలంలోని మోత్యతండాలో శుక్రవారం సాయంత్రం చోటు చేసుకుంది. బంధువులు, పోలీసులు తెలిపిన ప్రకారం వివరాల ప్రకారం.. మోత్యతండా గ్రామ పరిధిలోని నక్కలగండి తండాకు చెందిన కాట్రావత్‌ రూప్లా, సరోజ దంపతులకు ముగ్గురు కుమారులు కాట్రావత్‌ జగదీష్‌, కాట్రావత్‌ హరిప్రసాద్‌(7), కాట్రావత్‌ బిట్టు(5) ఉన్నారు. శుక్రవారం తండ్రి ట్రాక్టర్‌ కిరాయి నిమిత్తం వెళ్లగా.. తల్లి దేవరకొండకు పని నిమిత్తం వచ్చింది. అయితే నక్కలగండి కట్ట సమీపంలో ఇసుక తోడడంతో ఏర్పడిన గుంతల్లో డిండి ప్రాజెక్టు నీరు చేరి చెరువుగా మారింది. ఈక్రమంలో హరిప్రసాద్‌, బిట్టు ఇద్దరూ చెరువులో స్నానం చేయాలని భావించి ఇంటి నుంచి దుస్తులు తీసుకెళ్లారు. గమనించిన జగదీష్‌ తన ఇద్దరు తమ్ముళ్లను మందలించి సమీపంలోని తమ పొలానికి తీసుకెళ్లాడు. ఆ తర్వాత జగదీష్‌ పశువులను తీసుకొద్దామని వెళ్లాడు. అన్న లేకపోవడాన్ని గమనించిన ఇద్దరు తమ్ముళ్లు తిరిగి చెరువు వద్దకు వెళ్లి నీటిలోకి దిగారు. ప్రమాదవశాత్తు ఇరువురు నీట మునిగి మృతిచెందారు. సాయంత్రానికి ఇంటికి వచ్చిన తల్లిదండ్రులు పిల్లల కోసం వెతికారు. సమీపంలోని చెరువు వద్ద పిల్లల దుస్తులు ఉండడంతో చెరువులో గాలించడంతో ఇద్దరు చిన్నారులు విగత జీవులుగా మారారు. దీంతో తల్లిదండ్రులు గుండెలవిసేలా రోధించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సతీష్‌ తెలిపారు.



కాట్రావత్‌ హరిప్రసాద్‌, బిట్టు మృతదేహాలు

లారీని ఢీకొని వ్యక్తి మృతి

మిర్యాలగూడ: వేగంగా వెళ్తున్న లారీ ఒక్కసారిగా సడన్‌ బ్రేక్‌ వేయడంతో ద్విచక్ర వాహనదారుడు లారీని వెనుక నుంచి ఢీకొట్టి అక్కడికక్కడే మృతిచెందగా.. చిన్నారికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన దామరచర్ల మండల కేంద్రం శివారులో శుక్రవారం చోటు చేసుకుంది. వాడపల్లి ఇన్‌చార్జ్‌ ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. చివ్వెంల మండలం దురాజ్‌పల్లి గ్రామానికి చెందిన ఇరగదిండ్ల నవీన్‌(27) తల్లి లక్ష్మి ఇటీవల ఆంధ్రప్రదేశ్‌ రాష్ట్రం కారంపూడిలో మిర్చి ఏరడానికి వెళ్లింది. తనతోపాటు నవీన్‌ పెద్దకుమార్తె మూడేళ్ల వయసు గల శ్రావ్యను వెంటతీసుకెళ్లింది. శ్రావ్య రెండు రోజులుగా జ్వరంతో బాధపడుతుండడంతో తల్లి నవీన్‌కు సమాచారం అందించింది. ఈక్రమంలో అతడు గ్రామం నుంచి బైక్‌పై కారంపూడికి వెళ్లి కుమార్తెను తీసుకుని తిరిగి ఇంటికి వస్తున్నాడు. దామరచర్ల మండల కేంద్రం శివారులో వేగంగా వెళ్తున్న లారీ ఒక్కసారిగా సడన్‌ బ్రేక్‌ వేయడంతో నవీన్‌ ఆ వాహనాన్ని వెనుక నుంచి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో అతడి తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. శ్రావ్యకు తీవ్ర గాయాలు కావడంతో ప్రథమ చికిత్స నిమిత్తం మిర్యాలగూడకు తరలించి, మెరుగైన చికిత్స నిమిత్తం ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. మృతుడి భార్య గీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



ప్రమాదంలో మృతిచెందిన నవీన్‌

స్వర్ణగిరిలో ముగిసిన వార్షిక బ్రహ్మోత్సవాలు

భువనగిరి: పట్టణంలోని స్వర్ణగిరి శ్రీవేంకటేశ్వర స్వామి దేవాలయంలో ఆలయ ప్రథమ వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారం ముగిసాయి. 108 కలశాలతో అష్టోత్తర శత కళాభిషేకం నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలోని వేద పుష్కరిణిలో పుణ్యాహవచనం చేసి చక్రస్నానం జరిపించారు. సాయంత్రం స్వామి వారిని స్వర్ణ కవచంతో అలంకరించారు. స్వామి వారికి ద్వాదశారాధనం, తిరువారాధన చేశారు. అనంతరం పుష్పయాగం నిర్వహించారు. ఆలయ మాడ వీధుల్లో స్వామి అమ్మవార్లను ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక చైర్మన్‌ మానేపల్లి రామారావు, ధర్మకర్తలు మురళి కృష్ణ, గోపి కృష్ణ, ప్రధాన అర్చకులు శ్రవన్‌ కుమార్‌, అర్చకులు పాల్గొన్నారు.



పుష్కరిణిలో చక్రస్నానం చేయిస్తున్న అర్చకులు

బాలికపై లైంగిక దాడికి యత్నించిన వ్యక్తికి జైలు

రామగిరి(నల్లగొండ): బాలికపై లైంగిక దాడికి యత్నించిన వ్యక్తికి 16నెలల జైలు శిక్ష విధిస్తూ పోక్సో కోర్టు స్పెషల్‌ జడ్జి కులకర్ణి విశ్వనాథ్‌ దిలీప్‌ కుమార్‌ శుక్రవారం తీర్పు వెల్లడించారు. ప్రాసిక్యూషన్‌ కథనం ప్రకారం.. 2017లో మర్రిగూడ మండలం శివన్నగూడెం గ్రామానికి చెందిన చింతకుంట్ల నర్సిరెడ్డి.. ఇంట్లో ఒంటరిగా ఉన్న బాలికపై లైంగికంగా దాడి చేసేందుకు ప్రయత్నించాడు. బాలిక గట్టిగా కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు వచ్చారు. దీంతో సంఘటనా స్థలం నుంచి నిందితుడు పారిపోయాడు. బాలిక తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడిని కోర్టులో హాజరుపరిచారు. స్పెషల్‌ పబ్లిక్‌ ప్రాసిక్యూటర్‌ వేముల రంజిత్‌ కుమార్‌ వాదనలతో ఏకీభవించిన జడ్జి కులకర్ణి విశ్వనాథ్‌ దిలీప్‌ కుమార్‌ నిందితుడికి 16 నెలలు జైలు శిక్ష, రూ. 1500 జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు.

తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడికి గాయాలు

వలిగొండ: మండలంలోని గోకారం గ్రామానికి చెందిన కల్లుగీత కార్మికుడు మద్దెల మారయ్య శుక్రవారం ఉదయం తాటిచెట్టు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు చెట్టు పైనుంచి పడి తీవ్రంగా గాయపడ్డాడు. సమాచారం తెలుసుకున్న కుటుంబ సభ్యులు వెంటనే భువనగిరికి తరలించి ప్రథమ చికిత్స నిర్వహించి హైదరాబాద్‌కు తీసుకెళ్లారు.

కొంగలు మృత్యువాత

త్రిపురారం: బర్డ్‌ ఫ్లూ కారణంగా ఇప్పటికే వేలాది కోళ్లు మృత్యువాత పడుతున్నాయి. ఈనేపథ్యంలో త్రిపురారం మండల కేంద్రం నుంచి కుక్కడం వెళ్లే దారిలో కృషి విజ్ఞాన కేంద్రం వద్ద రోడ్డుపై పలు కొంగలు చనిపోయి ఉన్నాయి. ఇవి కూడా బర్డ్‌ఫ్లూ కారణంగానే మృతిచెంది ఉంటాయని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు ఈ ప్రాంతాన్ని సందర్శించాలని కోరుతున్నారు.



రోడ్డుపై మృతిచెంది ఉన్న కొంగలు

జోరుగా ఎద్దుల పందేలు



మేళ్లచెరువులో బండ లాగుతున్న గిత్తలు

మేళ్లచెరువు: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా మేళ్లచెరువు మండల కేంద్రంలో నిర్వహిస్తున్న ఎద్దుల పందేలు శుక్రవారం ఉత్సాహంగా జరిగాయి. ఆరు పండ్ల విభాగంలో 14 జతలు పాల్గొనగా ఎన్‌టీఆర్‌ జిల్లా విజయవాడకు చెందిన వల్లభనేని మోహన్‌రావు, రత్తయ్య చౌదరికి చెందిన జత 15 నిమిషాల సమయంలో 4000 అడుగుల దూరాన్ని లాగి మొదటి బహుమతి సాధించాయి. అదేవిధంగా ఎన్‌టీఆర్‌ కృష్ణాజిల్లా పెనుమలూరు మండలం యనమల కుదురు గ్రామానికి చెందిన అనంతనేని శ్రీకావ్య, శ్రీమధుకు చెందిన జత 15 నిమిషాల వ్యవధిలో 3867 అడుగుల దూరాన్ని లాగి రెండవ బహుమతి సాధించాయి. కోదాడ ఎమ్మెల్యే నలమాద ఉత్తమ్‌పద్మావతిలకు చెందిన జత 3516 అడుగుల దూరాన్ని లాగి మూడవ బహుమతి సాధించాయి. బాపట్ల జిల్లా పర్చూరు మండలం కోట్లవారిపాలేనికి చెందిన నాగబోయిన వెంకట్రావు, సుబ్బారావుకు చెందిన జత 15 నిమిషాల సమయంలో 3341 అడుగులు దూరం లాగి నాలుగవ బహుమతి, మేళ్లచెరువు మండల కేంద్రానికి చెందిన పోశం వీరకుమారికి చెందిన జత 3057 అడుగుల దూరం లాగి 5వ బహుమతి సాధించినట్లు నిర్వాహకులు తెలిపారు. విజేతలకు మొదటి బహుమతి కింద రూ.70 వేలు, రెండవ బహుమతి రూ.60 వేలు, మూడవ బహుమతి రూ.50 వేలు, నాల్గవ బహుమతి రూ.40 వేలు, ఐదవ బహుమతి రూ.30 వేలు అందజేశారు.

కబడ్డీ పోటీలు ప్రారంభం

మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా నిర్వహిస్తున్న మహిళా కబడ్డీ పోటీలు శుక్రవారం రాత్రి ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను తిలకించేందుకు కబడ్డీ క్రీడాకారులు, అభిమానులు అధికసంఖ్యలో వచ్చారు.



కబడ్డీ పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

ముగిసిన మహా శివరాత్రి ఉత్సవాలు

- పూర్ణాహుతి, త్రిశూల తీర్థం నిర్వహించిన అర్చకులు

యాదగిరిగుట్ట: యాదగిరీశుడి దేవాలయానికి అనుబంధంగా కొనసాగుతున్న శ్రీపర్వత వర్ధినీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 23వ తేదీన ప్రారంభమైన మహా శివరాత్రి ఉత్సవాలు శుక్రవారం ముగిశాయి. ఉదయం ఆలయంలో నిత్యహవనాలు, శివ పంచాక్షరీ జపాలు, నందీశ్వర పారాయణాలు, పంచసూక్త పఠనం గావించారు. ఆలయంలో మహా పూర్ణాహుతి జరిపించి, కొండపైన విష్ణు పుష్కరిణిలో త్రిశూల తీర్థ కార్యక్రమం నిర్వహించారు. స్మార్త ఆగమశాస్త్ర ప్రకారం ఈ పూర్ణాహుతి వేడుకలు జరిపించారు. సాయంత్రం పారాయణీకులచే స్తోత్ర, వేద, నమక, చమక పారాయణాలు, మంత్రపుష్ప పఠనాలు, సోమకుంభార్చనలు, మూలమంత్ర పారాయణాలు చేపట్టారు. రాత్రి శివపార్వతుల ఏకాంత శృంగార డోలోత్సవం నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నర్సింహమూర్తి, అధికారులు, పూజారులు పాల్గొన్నారు.



శివాలయంలో మహా పూర్ణాహుతి నిర్వహిస్తున్న అర్చకులు

శ్రీలక్ష్మీనారసింహుడికి సమర్పించే పట్టువస్త్రాల పరిశీలన

భూదాన్‌పోచంపల్లి: యాదాద్రి శ్రీలక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా పోచంపల్లి పద్మశాలీ మహాజన సంఘం ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్లకు సమర్పించనున్న పట్టు వస్త్రాలను శుక్రవారం యాదాద్రి దేవస్థానం డిప్యూటీ ఈఓ భాస్కర్‌ శర్మ, అసిస్టెంట్‌ ఎగ్జిక్యూటివ్‌ అధికారులు రమేష్‌ బాబు, జె.కృష్ణ, సూపరింటెండెంట్‌ నరేశ్‌ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. శనివారం నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో దేవస్థానం ఈఓ భాస్కర్‌రావు ఆదేశాల మేరకు స్వామి, అమ్మవార్ల కల్యాణానికి సమర్పించే పట్టు వస్త్రాలను పరిశీలించేందుకు వచ్చినట్లు చెప్పారు. పద్మశాలీ మహాజన సంఘం అధ్యక్షుడు సీత శ్రీరాములు మాట్లాడుతూ.. అమ్మవారికి శంఖు, చక్రాలు కలిగిన చిలుకపచ్చ రంగుతోపాటు పర్పుల్‌ రంగు కొంగు చీర, మరొకటి హాఫ్‌వైట్‌ చీరలను నేసినట్లు తెలిపారు. అదేవిధంగా స్వామివారికి రెండు పట్టు పంచెలు, రెండు శాలువాలను సమర్పించనున్నట్లు పేర్కొన్నారు. శనివారం బ్రహ్మోత్సవాల అంకురార్పణ రోజు ప్రదర్శనగా వెళ్లి దేవస్థాన అధికారులకు పట్టు వస్త్రాలను సమర్పించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షులు భోగ నర్సింహ, అంకం మురళి, ప్రధానకార్యదర్శి భారత బాలరత్నం, సహాయ కార్యదర్శి కడవేరు చంద్రమౌళి, కోశాధికారి సంగెం చంద్రయ్య, సభ్యులు గుండు పాండు, కర్నాటి అంజమ్మ తదితరులు పాల్గొన్నారు.



అమ్మవారికి సమర్పించనున్న పట్టు చీరను పరిశీలిస్తున్న యాదాద్రి దేవస్థానం అధికారులు

భువనగిరిలో వ్యక్తి అదృశ్యం

భువనగిరిటౌన్‌: మేస్త్రీగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్న ఓ వ్యక్తి అదృశ్యమయ్యాడు. ఎలూరు జిల్లాకు చెందిన జిట్టు శ్రీను గత కొన్ని రోజులుగా భువనగిరిలో మేస్త్రీ పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. శ్రీను గత నెల 13న ఇంటి నుంచి వెళ్లిపోయాడు. ఇప్పటివరకు తిరిగి రాకపోవడంతో అతని సోదరుడు జిట్టు సత్తిబాబు శుక్రవారం భువనగిరి పట్టణ పోలీస్‌ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పట్టణ ఎస్‌ఐ కుమారస్వామి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

తప్పిపోయిన పిల్లికోసం వెతుకులాట

- ఊరూరా తిరుగుతూ ఆరా తీస్తున్న మహిళ
- అప్పగించిన వారికి పారితోషికం ఇస్తామని ప్రకటన

అర్వపల్లి: ఆమె అల్లారు ముద్దుగా పెంచుకుంటున్న పిల్లి తప్పిపోయింది. దీంతో ఆ మహిళ వారం రోజులుగా అన్న పానియాలు మాని ఊరూరా తిరుగుతూ పిల్లి జాడ కోసం ఆరా తీస్తోంది. పిల్లి లేకపోతే తాను బతకలేనంటూ బోరున విలపిస్తోంది. జాజిరెడ్డిగూడెం మండలం కాసర్లపహాడ్‌ గ్రామానికి చెందిన బండారి పద్మ ఐదేళ్ల క్రితం పిల్లి పిల్లను తెచ్చుకొని పెంచుకుంటోంది. తనకు కుమారులు లేకపోవడంతో ఆ పిల్లిని కుమారుడిగా భావిస్తూ పెంచుతోంది. దానికి రోజూ అరలీటర్‌ పాలు తెచ్చి తాపిస్తోంది. అదేవిధంగా రెండు రోజులకోసారి స్నానం చేయించడం, రోజూ తాను అన్నం తినేటప్పుడు పిల్లికి కూడా తినిపించడం వంటివి చేస్తోంది. అయితే వారం రోజుల క్రితం ఆ పిల్లి ఇంటి నుంచి వెళ్లిపోయింది. దీంతో ఆరోజు నుంచి అన్న పానియాలు మాని కూలి పనులకు వెళ్లకుండా పిల్లి ఆచూకీ కోసం ఒక ఆటోను కిరాయికి తీసుకొని తమ గ్రామంతోపాటు పక్కన ఉన్న గ్రామాల్లో వెతుకుతోంది. మరోవైపు ఆమె భర్త వెంకటయ్య కూడా పిల్లి జాడ కోసం తిరుగుతున్నాడు. తమ పిల్లి కనిపిస్తే అప్పగించాలని వారికి తగిన పారితోషికం ఇస్తామని పద్మ పేర్కొంటున్నారు.



పిల్లి జాడ తెలిస్తే సమాచారం అందించాలని వేడుకుంటున్న పద్మ

స్వయం ఉపాధి, సాంకేతిక కోర్సుల్లో ఉచిత శిక్షణ

భూదాన్‌పోచంపల్లి: భూదాన్‌ పోచంపల్లి మండలంలోని జలాల్‌పురంలో గల స్వామి రామానందతీర్థ గ్రామీణ సంస్థలో 45 రోజుల స్వల్పకాలిక వ్యవధి కలిగిన పలు స్వయం ఉపాధి, సాంకేతిక కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు సంస్థ డైరెక్టర్‌ పీఎస్‌ఎస్‌ఆర్‌ లక్ష్మి శుక్రవారం తెలిపారు. స్పోకెన్‌ ఇంగ్లిష్‌ అండ్‌ సాఫ్ట్‌ స్కిల్స్‌ కోర్సుకు ఇంటర్మీడియట్‌, కంప్యూటర్‌ సాఫ్ట్‌వేర్‌ ఇన్‌స్టలేషన్‌ కోర్సుకు ఇంటర్‌ పాస్‌, లేదా ఫెయిల్‌, మొబైల్‌ ఫోన్‌ రిపేరింగ్‌ (సాఫ్ట్‌వేర్‌ అండ్‌, హార్డ్‌వేర్‌) కోర్సుకు పదో తరగతి, ఏసీ, రిఫ్రిజిరేటర్‌ రిపేర్‌ అండ్‌ మెయింటనెన్స్‌ కోర్సుకు పదో తరగతి విద్యార్హత కలిగి ఉండాలని పేర్కొన్నారు. అభ్యర్థులు 18 నుంచి 30 సంవత్సరాల వయస్సు కల్గి ఉండాలని తెలిపారు. హాస్టల్‌ వసతి ఉంటుందని, ఆసక్తి కలిగిన అభ్యర్థులు తమ విద్యార్హతల సర్టిఫికెట్లు, ఆధార్‌, రేషన్‌కార్డు, పాస్‌పోర్ట్‌ సైజ్‌ ఫొటోలతో ఈనెల 6న సంస్థలో నిర్వహించే కౌన్సిలింగ్‌కు నేరుగా హాజరు కావాలని కోరారు.

లభ్యం కాని బాలిక ఆచూకీ

కోదాడరూరల్‌: స్నాప్‌చాట్‌లో పరిచయమైన బాలుడి కోసం కోదాడకు వచ్చి అదృశ్యమైన మేళ్లచెర్వు మండలానికి చెందిన బాలిక ఆచూకీ శుక్రవారం వరకు లభించలేదు. సదురు బాలిక ఇంటి నుంచి బయటకు వచ్చి ఆరు రోజులు గడుస్తున్నా ఆమె ఆచూకీ లభ్యం కాకపోవడంతో కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. బాలికను కోదాడ రప్పించిన విషయంలో ఆ బాలుడు ఒక్కడే ఉన్నాడా.. లేక అతను చెప్తున్నట్లు మరో ఇద్దరు యువకులు కూడా ఉన్నారా.. అనే విషయాలు పోలీసుల విచారణలో తెలియాల్సి ఉంది. అయితే ఆ బాలుడు మత్తుపదార్థాలకు కూడా అలవాటు పడినట్లు చర్చ నడుస్తోంది. బాలిక అదృశ్యమైన సంఘటనపై ఆమె కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు మేళ్లచెర్వు పోలీసులు కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించినట్లు సమాచారం.

వృద్ధురాలి హత్యకేసులో నిందితుడికి జీవిత ఖైదు

చౌటుప్పల్‌ రూరల్‌: చౌటుప్పల్‌ మండలం కొయ్యలగూడెం గ్రామంలో 2022లో జరిగిన వృద్ధురాలి హత్యకేసులో ఓ వ్యక్తికి జీవిత ఖైదుతో పాటు రూ.20వేల జరిమానా విధిస్తూ భువనగిరి జిల్లా కోర్టు జడ్జి శుక్రవారం తీర్పునిచ్చారు. కొయ్యలగూడెం గ్రామానికి చెందిన అయిటిపాముల రామాంజనేయులు(46) చేనేత కార్మికుడిగా పని చేస్తున్నాడు. 2022లో ఇదే గ్రామానికి చెందిన ఓ వృద్ధురాలి మెడలో ఉన్న బంగారు ఆభరణాలను చోరీచేసేందుకు ఆమెను హత్య చేశాడు. అప్పటి చౌటుప్పల్‌ సీఐ మల్లికార్జున్‌ రెడ్డి నిందితుడిని పట్టుకుని అతనిపై హత్యకేసు నమోదు చేశారు. విచారణ అనంతరం శుక్రవారం జిల్లా కోర్టు నిందితుడికి జీవిత ఖైదు విధించినట్లు సీఐ మన్మథకుమార్‌ తెలిపారు.

రికవరీ ఆఫీసర్‌ - I / II కార్యాలయం
డెట్స్‌ రికవరీ ట్రిబ్యునల్‌ హైదరాబాద్‌ (DRT 2)
1వ అంతస్తు, త్రివేణి కాంప్లెక్స్‌, అబిడ్స్‌, హైదరాబాద్‌ - 500001.

డిమాండ్‌ నోటీసు

రికవరీ ఆఫ్‌ డెట్స్‌ అండ్‌ బ్యాంక్‌రప్టసీ యాక్ట్‌, 1993లోని సెక్షన్స్‌ 25 నుండి 28 మరియు ఆదాయ పన్ను చట్టం, 1961కు రెండవ షెడ్యూలులోని రూల్‌ 2 క్రింద ప్రకటన

RC/1858/2017 19.02.2025

స్టేట్‌ బ్యాంక్‌ ఆఫ్‌ ఇండియా
వర్సెస్‌
విజయ భారతి బోర్‌వెల్స్‌ మరియు ఇతరులు

To

(CD-1) విజయ భారతి బోర్‌వెల్స్‌, ప్రాతినిధ్యం వహిస్తున్న దాని మేనేజింగ్‌ పార్ట్‌నర్‌ శ్రీ జి.కొండల్‌ రావు, 4-115, రాజధాని టాకీస్‌ వెనుక, దుర్గానగర్‌, దిల్‌సుఖ్‌నగర్‌, హైదరాబాద్‌, తెలంగాణ.

(CD-2) శ్రీ జి.కొండల్‌ రావు, తండ్రి నర్సింగ రావు, నివాసం: నం. 4-115, రాజధాని టాకీస్‌ వెనుక, దుర్గానగర్‌, దిల్‌సుఖ్‌నగర్‌, హైదరాబాద్‌, తెలంగాణ.

(CD-3) శ్రీ జి.ప్రభాకర్‌ రావు తండ్రి వెంకట నరసింహ రావు, నివాసం: నం. 4-115, రాజధాని టాకీస్‌ వెనుక, దుర్గానగర్‌, దిల్‌సుఖ్‌నగర్‌, హైదరాబాద్‌, తెలంగాణ.

(CD-4) శ్రీ జి.మనోహర్‌ రావు తండ్రి వెంకట నరసింహ రావు, నివాసం: నం. 4-115, రాజధాని టాకీస్‌ వెనుక, దుర్గానగర్‌, దిల్‌సుఖ్‌నగర్‌, హైదరాబాద్‌, తెలంగాణ.

OA/183/1996లో గౌరవనీయ ప్రిసైడింగ్‌ ఆఫీసర్‌, డెట్స్‌ రికవరీ ట్రిబ్యునల్‌, హైదరాబాద్‌ (DRT-2) వారిచే ఆమోదించబడిన ఉత్తర్వులకు అనుగుణంగా జారీచేయబడిన రికవరీ సర్టిఫికెట్‌ ప్రకారం మొత్తం **రూ.2224045.00 (ఇరవై రెండు లక్షల ఇరవై నాలుగు వేల నలభై ఐదు రూపాయలు మాత్రమే)**తో పాటు వ్యాజ్యకాలంలో మరియు // నుండి వర్తింపుతో రాబట్టుకునే వరకు % వంతున భవిష్య వడ్డీ మరియు వ్యయాలు **రూ.0 (మాత్రమే)** మీపై (ఉమ్మడిగా మరియు విడిగా/ పూర్తిగా/ పరిమితంగా) బకాయి ఉన్నాయని తెలియజేయడమైనది.

2. ఈ నోటీసు స్వీకరణ నుండి 15 రోజులలోగా పైన తెలిపిన మొత్తాన్ని చెల్లించాలని మిమ్మల్ని ఇందుమూలంగా ఆదేశించడమైనది, లేనిచో రికవరీ ఆఫ్‌ డెట్స్‌ డ్యూ టు బ్యాంక్స్‌ అండ్‌ ఫైనాన్షియల్‌ ఇన్‌స్టిట్యూషన్స్‌ యాక్ట్‌, 1993 మరియు అందులోని నియమాలకు అనుగుణంగా రికవరీ చేయబడును.

3. మీ ఆస్తుల వివరాల అఫిడవిట్‌ను విచారణ తదుపరి తేదీన లేదా ఆలోగా వెల్లడించాలని ఇందుమూలంగా మిమ్మల్ని ఆదేశించడమైనది.

4. తదుపరి ప్రొసీడింగ్స్‌ కోసం **12-03-2025న ఉ.10:30 గం.కు** దిగువ సంతకందారు సమక్షంలో హాజరవ్వాలని మిమ్మల్ని ఇందుమూలంగా ఆదేశించడమైనది.

5. పైన తెలిపిన మొత్తానికి అదనంగా మీరు చెల్లించవలసినవి:

(ఎ) సర్టిఫికెట్‌ / ఎగ్జిక్యూషన్‌ ప్రొసీడింగ్స్‌ యొక్క ఈ నోటీసు తరువాత వెంటనే ప్రారంభమయ్యే కాలానికి చెల్లించవలసిన వడ్డీలు.

(బి) ఈ నోటీసు మరియు వారంట్లు అందించడానికి మరియు మొత్తం బకాయిని రాబట్టుకోవడానికి తీసుకున్న ఇతర ప్రక్రియలు మరియు అన్ని ఇతర ప్రొసీడింగ్స్‌కు సంబంధించి అయిన అన్ని వ్యయాలు, చార్జీలు మరియు ఖర్చులు.

నాచే స్వయంగా ఈ ట్రిబ్యునల్‌ సీలుతో **19-02-2025** తేదీన ఇవ్వబడింది.

సం/- రికవరీ ఆఫీసర్‌
డెట్స్‌ రికవరీ ట్రిబ్యునల్‌ హైదరాబాద్‌ (DRT 2)